# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 25-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాల్దీవుల పర్యటన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాలు జరిగాయి.
- సైనికుల భద్రత కోసం.. ఎయిర్ డిఫెన్స్ ఫైర్ కంట్రోల్ రాడార్లను కొనుగోలు చేయాలని భారత రక్షణ శాఖ నిర్ణయించింది.
- భారత్‌లో ఓడరేవులు.. మెరుగైన పనితీరును ప్రదర్శిస్తున్నాయని కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు.
- నదులలో నీటి ప్రవాహాన్ని పెంపొందించడానికి పటిష్టమైన కార్యాచరణను రూపొందించవలసి ఉందని కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్ ఉద్ఘాటించారు.
- భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న 4వ టెస్ట్ మ్యాచ్‌లో 3వరోజు టీ విరామ సమయానికి ఇంగ్లండ్ 4 వికెట్ల నష్టానికి 433 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యునైటెడ్ కింగ్‌డమ్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని, రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈరోజు మాల్దీవుల రాజధాని మాలేకు చేరుకున్నారు. అక్కడ ఆయనకు ఘన స్వాగతం లభించింది. ప్రధానమంత్రి తొలుత మాల్దీవుల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అలాగే మాల్దీవుల అధ్యక్షుడు డాక్టర్ మొహమ్మద్ ముయిజ్జు.. భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తదితర భారతీయ అధికారులతో సమావేశమయ్యారు. మాలేలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మాల్దీవుల అధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ ముయిజ్జు మధ్య ప్రతినిధి స్థాయి చర్చలు పూర్తయ్యాక, భారత్, మాల్దీవులు పలు ఒప్పందాలు చేసుకున్నాయి. అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ.. ఇరు నేతల మధ్య జరిగిన చర్చల వివరాలను వెల్లడించారు.

(వాయిస్ బైట్...30 సెకన్లు)

కాగా.. మాల్దీవుల స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా ఆ దేశ అధ్యక్షుడికి, దేశ ప్రజలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. మాల్దీవులలో మూడవసారి పర్యటిస్తున్న ప్రధానమంత్రి ఆ దేశ 60వ స్వాతంత్ర్య దినోత్సవాలకు గౌరవ అతిథిగా హాజరుకానున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత సైన్యం కోసం 2వేల కోట్ల రూపాయల విలువైన ఎయిర్ డిఫెన్స్ ఫైర్ కంట్రోల్ రాడార్లను కొనుగోలు చేయాలని భారత రక్షణ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఫైర్ కంట్రోల్ రాడార్‌లు.. యుద్ధ విమానాలు, దాడులు చేసే హెలికాప్టర్లు, డ్రోన్‌లతో సహా వాయుమార్గంలో వచ్చే అన్ని ప్రమాదాలను గుర్తించగలవు. ఇది ఎయిర్ డిఫెన్స్ రెజిమెంట్ల ఆధునీకరణలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని, భారత సైన్యం కార్యాచరణ సన్నద్ధతను పెంచుతుందని రక్షణ రంగ వర్గాలు వెల్లడించాయి.

==============================

భారతీయ ఓడరేవులు.. నౌకల సగటు టర్న్‌అరౌండ్ సమయాన్ని గణనీయంగా మెరుగు పరిచాయని కేంద్ర నౌకాశ్రయాలు, షిప్పింగ్, జలమార్గాల శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. మారిటైమ్ ఫైనాన్సింగ్ సమ్మిట్-2025లో ఆయన మాట్లాడుతూ, దేశీయ ఓడరేవులు అనేక అభివృద్ధి చెందిన దేశాల కంటే మెరుగైన పనితీరును కనబరుస్తున్నాయన్నారు. ప్రధాన ఓడరేవుల్లో కంటైనర్ సామర్థ్యం 70 శాతానికి పైగా పెరిగిందని, తీర ప్రాంత, లోతట్టు జలమార్గాల ద్వారా కార్గో వాల్యూమ్‌లు రెట్టింపు అయ్యాయని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు.

==============================

నదులలో నీటి ప్రవాహాన్ని పెంపొందించడానికి పటిష్టమైన, సమగ్ర కార్యాచరణను రూపొందించవలసిన అవసరం ఉందని కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ ఉద్ఘాటించారు. ఈరోజు న్యూఢిల్లీలో.. గంగానది, దాని ఉపనదుల పర్యావరణహితమైన ప్రవాహంపై దృష్టి సారించే అంశంపై సమగ్ర సమావేశం జరిగింది. ఆ సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి.. పర్యావరణ వ్యవస్థలను సంరక్షించడం, నీటి వనరులను సమతుల్యంగా ఉపయోగించుకోవడం ఆవశ్యకమని పేర్కొన్నారు. అధిక నీటి వినియోగం, కాలుష్య సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రాంతాలలో యమునా నదిలో నీటి ప్రవాహాన్ని మెరుగుపరచడానికి నిర్దిష్ట వ్యూహాలు, సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని అన్నారు.

==============================

విరామం

==============================

దేశీయంగా అభివృద్ధి చేసిన ఓ క్షిపణిని కర్నూలు జిల్లాలోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజిలో ఈరోజు విజయవంతంగా పరీక్షించామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేస్తూ.. యూఏవీ లాంచ్‌డ్ ప్రెసిషన్ గైడెడ్ మిసైల్‌గా పిలవబడే ఈ క్షిపణి భారత సాయుధ దళాల డ్రోన్ యుద్ధతంత్రాన్ని మరింత పదును తేల్చే ఆయుధమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన.. డీఆర్‌డీవోతో పాటు ఈ క్షిపణి అభివృద్ధి, తయారీలో భాగస్వాములైన ఎంఎస్ఎంఈ, ఇతర అంకుర సంస్థలను అభినందించారు. సంక్లిష్టమైన సాంకేతికతను అర్థం చేసుకోవడంతో పాటు.. ఉత్పత్తి చేసే సత్తా భారత్‌కు ఉందని ఈ పరీక్ష నిరూపించిందని రక్షణ మంత్రి వివరించారు.

==============================

భారతదేశం మాల్దీవులకు 4 వేల 850 కోట్ల రూపాయల రుణ సహాయాన్ని ప్రకటించిందని విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. మాల్దీవుల పర్యటనలో భాగంగా ఆ దేశ అధ్యక్షుడు మొహమ్మద్ మొయిజ్జుతో, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమావేశానంతరం పలు ఒప్పందాలపై ఇరు దేశాల ప్రతినిధులు సంతకాలు చేశాయని ఆయన పేర్కొన్నారు. భారత్ - మాల్దీవుల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నిబంధనలను ఇరు దేశాలు అంగీకరించాయని తెలిపారు. ఇరు దేశాలు ఈరోజు 4 ఎంఓయూలు, 3 ఒప్పందాలపై సంతకాలు చేశాయని అన్నారు. ఫిషరీస్, ఆక్వాకల్చర్, డిజిటల్ సొల్యూషన్, తదితర రంగాలకు సంబంధించి ఒప్పందాలు జరిగాయని విక్రమ్ మిస్రీ పేర్కొంటూ...

(వాయిస్ బైట్...33 సెకన్లు)

==============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపటి నుంచి రెండు రోజుల పాటు తమిళనాడు రాష్ట్రంలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా టుటికోరిన్‌లో 4వేల 800 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి, దేశానికి అంకితం చేయనున్నారు. సుమారు 450 కోట్ల రూపాయల ఖర్చుతో అభివృద్ధి చేసిన టుటికోరిన్ విమానాశ్రయంలోని నూతన టెర్మినల్ భవనాన్ని ఆయన ప్రారంభిస్తారు. అలాగే.. కీలకమైన రెండు హైవే ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. వీటితోపాటు దక్షిణ తమిళనాడులో మూడు కీలక రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు. అరళ్వాయిమొళి-నాగర్‌కోయిల్ జంక్షన్, ఇంకా తిరునెల్వేలి-మేలప్పాలయం సెక్షన్ల డబ్లింగ్ ప్రాజెక్టులను కూడా ప్రధానమంత్రి ఈ పర్యటనలో భాగంగా ప్రారంభించనున్నారు.

==============================

కార్గిల్ విజయ్ దివస్ స్మారకోత్సవాలలో భాగంగా ఈరోజు లడఖ్‌లోని ద్రాస్‌లో లమోచన్ వ్యూ పాయింట్ వద్ద ఓ కార్యక్రమం నిర్వహించారు. 14వ కార్ప్స్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ హితేష్ భల్లా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖలుబర్ సెక్టార్‌లో పోరాడిన కార్గిల్ యుద్ధ యోధుడు, ఫ్లాగ్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సీఈవో, విశ్రాంత మేజర్ జనరల్ అషిమ్ కోహ్లి జాతీయ జెండాను ఎగురవేసి, వేడుకలను ప్రారంభించి, అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 124వ సంచిక ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్ తీరప్రాంతం, వాయువ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాలలో కొనసాగుతున్న అల్పపీడనం కారణంగా దేశంలోని అనేక ప్రాంతాలలో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. రానున్న నాలుగైదు రోజుల్లో మధ్య, తూర్పు భారతదేశ పశ్చిమ తీరం వెంబడి, కొండ ప్రాంతాల్లోను రుతుపవన ప్రభావం చురుకుగా ఉంటుందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మాంచెస్టర్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగవ టెస్టు మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో మూడవరోజు టీ విరామ సమయానికి ఇంగ్లండ్ 4 వికెట్లు నష్టపోయి 433 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్ జో రూట్ టెస్టుల్లో తన 38వ సెంచరీ పూర్తిచేసి ఇంకా క్రీజులో కొనసాగుతున్నాడు. భారత బౌలర్లలో వాషింగ్‌టన్ సుందర్ 2 వికెట్లు తీయగా, అన్షుల్ కాంబోజ్, రవీంద్ర జడేజా చెరో వికెట్ తీసారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =